

గ్రామ, వార్డు స్థాయి నుంచి ఆడుదాం ఆంధ్ర

గ్రామస్థాయి నుంచి క్రీడాస్ఫూర్తి కలిగించేందుకు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. - 10లో..



సీఎం జగన్ ఆలోచనే వైఎస్సార్ సీపీ సిద్ధాంతం

సీఎం వైఎస్ జగన్ ఆలోచనే వైఎస్సార్ సీపీ సిద్ధాంతమని ఎమ్మెల్యే టీజేఆర్ అన్నారు. - 10లో..

గరిష్టం/కనిష్టం
33.1/25.2

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.

న్యూస్‌రీల్

ఇద్దరు ఎస్సైల బదిలీ

● ఉత్తర్వులు జారీ చేసిన ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు సబర్బన్: జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు ఎస్సైలను బదిలీ చేస్తూ ఎస్పీ మలికాగర్గ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్.సుబ్బారావును ఒంగోలు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు, అదే తాలూకా పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న జి.ప్రభాకర రెడ్డిని ఒంగోలు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేస్తూ అటాచ్‌మెంట్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరిద్దనీ ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్ నుంచి రిలీవ్ చేసి బదిలీ అయిన పోలీస్ స్టేషన్‌లలో జాయిన్ చేసుకోవాలని ఒంగోలు డీఎస్పీ వి.నారాయణ స్వామి రెడ్డిని ఎస్పీ ఆదేశించారు.

స్పందనతో ప్రజాసమస్యల పరిష్కారం

● జేసీ శ్రీనివాసులు



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ కె.శ్రీనివాసులు

కంభం: గ్రామస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం మండలాల వారీగా స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. స్థానిక యూబీ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమంలో జేసీ శ్రీనివాసులు, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, స్పందన సూపర్‌వైజర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామసుబ్బులు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. 263 మంది అర్జీదారులు తమ సమస్యలు పరిష్కరించాలంటూ అర్జీలు సమర్పించారు. అర్జీలు పరిశీలించి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. హజరత్ గూడెం పంచాయతీ పరిధిలో సుమారు 2500 మందికి పైగా జనాభా ఉన్నారని, ప్రత్యేకంగా సచివాలయం ఏర్పాటు చేయాలని సర్పంచ్ మహబూబ్ పీరా అర్జీ సమర్పించారు. అదే విధంగా గ్రామంలో ఎస్టీ వలంటీర్ పోస్టుకు మూడు సంవత్సరాల నుంచి ఎవరూ ముందుకు రాలేదని, రిజర్వేషన్ మార్చాలని, పంచాయతీ పరిధిలోని అర్బన్ ఏరియాలో చెత్తసేకరణకు ట్రాక్టర్ మంజూరు చేయాలని ఆయన వినతి పత్రం అందజేశారు. కంభానికి చెందిన రైతు రమేష్ బేస్తవారిపేట మండలంలోని నేకునాంబాద్ ఇలాఖాలో ఉన్న తనపొలం ఆక్రమణకు గురైనా అధికారులు పట్టించుకోవడం లేదని ఎద్దులబండిపై ఫ్లెక్సీలో అధికారుల పేర్లు వేసి నిరసన తెలిపాడు. ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ, హజరత్‌గూడెం సర్పంచ్ మహబూబ్‌పీరా అధికారులను సన్మానించారు.

రోడ్ల నిర్మాణానికి రూ.6.33 కోట్లు మంజూరు

మార్కాపురం: నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక నిధులు విడుదల చేస్తున్నట్లు శుక్రవారం ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి తెలిపారు. పొదిలి మండలం ఉన్నగురువాయపాలెం నుంచి వెలిగండ్ల వయా కుంచేపల్లి, గొల్లపల్లి, ఈగలపాడు వరకు రోడ్డు నిర్మాణానికి రూ.6.33 కోట్లు మంజూరు చేస్తూ జీఓ నంబర్ 788ని విడుదలైందని ఎమ్మెల్యే తెలిపారు. సుమారు 12.22 కి.మీ పొడవున రోడ్డు నిర్మిస్తారని అన్నారు. ముఖ్యమంత్రికి నియోజకవర్గ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు. ఈ మేరకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు వివరించారు.

ఇంటింటా స్వచ్ఛజలం

జిల్లాలో లక్షలాది మంది ప్రజలకు ప్రతి రోజూ ఒక్కొక్కరికి 55 లీటర్ల చొప్పున సురక్షితమైన తాగునీరు అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీటి నాణ్యతను ఎప్పటికప్పుడు పరీక్షిస్తున్నారు. అందుకోసం ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ప్రయోగశాలలు ఏర్పాటు చేసింది. జిల్లాలోని 11 ప్రాంతాల నుంచి తీసుకొచ్చే శాంపిల్స్ నీటిలో 13 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. చాలా వరకు పైపులైన్ల ద్వారా ఇంటింటికీ సరఫరా చేస్తుండగా, పైపులైన్లు లేనిచోట్ల ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు.



నీటిని పరీక్షిస్తున్న సిబ్బంది

గ్రామీణ ప్రజలకు అందుతున్న నీటి వివరాలు

జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీలు: 731	ఆవాస ప్రాంతాలు :1,788
రోజుకు ఒక వ్యక్తికి అందిస్తున్న రక్షిత మంచినీరు: 55 లీటర్లు	

జిల్లాలోని నీటి వనరులు: రామతీర్థం, నాగార్జునసాగర్, గుండ్లకమ్మ, కొమ్మమూరు	
సీపీడబ్ల్యూఎస్‌లు: 28	పీడబ్ల్యూఎస్‌లు: 749
ఎంపీడబ్ల్యూఎస్‌లు: 832	

డైరెక్ట్ పంపింగ్: 984	చేతిపంపులు: 16,245
మంచినీటి చెరువులు: 137	
జిల్లాలో గ్రామీణ జనాభా: 20,38000	
గృహాల సంఖ్య: 4,98,539	

● ఉమ్మడి జిల్లాలో 11 నీటి పరీక్ష ల్యాబ్‌లు
● ఆర్వో ప్లాంట్ల నుంచి పల్లె ప్రజలకు సురక్షితనీరు
● 13 రకాల నీటి పరీక్షల నిర్వహణ
● రసాయనాలు, కలుషితాల గుర్తింపు
● జల జీవన్ మిషన్ ద్వారా 3.21 లక్షల మందికి తాగునీరు

ఒంగోలు సిటీ:

గ్రామీణ ప్రాంత ప్రజలకు సురక్షితమైన నీటిని అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. నీటి పథకాల ద్వారా సరఫరా చేస్తున్న నీటిని ఏడాదికి రెండుసార్లు ల్యాబుల్లో పరీక్షించి హానికరమైన పదార్థాలు ఉంటే స్వచ్ఛమైన నీటిని అందించేందుకు చర్యలు చేపడుతోంది. ఇందుకు సంబంధించి ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో 11 ప్రయోగశాలలు నిరంతరాయంగా పనిచేస్తున్నాయి. వీటిలో నిత్యం తాగే నీటిలో ఉన్న నైట్రేట్, ఫ్లోరైడ్, సల్ఫేట్, కాల్షియం, ఐరన్ తదితరాల శాతాన్ని గుర్తిస్తున్నారు. వివిధ రకాల రసాయనాల వల్ల తాగునీరు కలుషితం కావడంతో ప్రజలు పలు రోగాల బారిన పడే అవకాశాలను తెలియజేసేందుకు ఈ పరీక్షలు కొనసాగిస్తున్నారు. గతంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఫ్లోరైడ్ సమస్య ప్రస్తుతం తగ్గిపోయింది. గతంలో ఫ్లోరైడ్ నీటిని తాగడం వల్ల కీళ్ల సమస్య, కాళ్లు వంకరపోవడం, పళ్ల రంగు మారడం వంటి సమస్యలతో అనేక మంది ప్రజలు ఇబ్బంది పడ్డారు. తాగునీటిలో ఉండే మూలకాలు తగు మోతాదులో లేని పక్షంలో అనేక రకాల వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నందున నీటి పరీక్షలకు ప్రాధాన్యత పెరిగింది.



జల జీవన్ పథకం నమూనాను మంత్రి మేరుగు నాగార్జునకు వివరిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మారధాన్ ఆలీ (ఫైల్)

శాంపిల్స్ నీటిలో 13 రకాల పరీక్షల నిర్వహణ:

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఒంగోలు, మేదరమెట్ల, పర్చూరు, కందుకూరు, కనిగిరిలో-2, గిద్దలూరు, యర్రగొండపాలెం, కొండపి, దర్శి, పొదిలి వంటి 11 ప్రాంతాల్లోని ల్యాబ్‌ల్లో 48 మంది పనిచేస్తున్నారు. ఈ ప్రాంతాల నుంచి తీసుకొచ్చే శాంపిల్స్ నీటిలో 13 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా నీటిలో కరిగి ఉన్న మొత్తం లవణాల సంఖ్య (టీడీఎస్), నీటి కాఠిన్యత(టోటల్ హార్డ్‌నెస్), కాల్షియం, క్లోరైడ్, నీటిలో మిగిలిన ఉన్న క్లోరిన్, సల్ఫేట్, నైట్రేట్, ఐరన్ వంటి తదితర పరీక్షలు చేపడుతున్నారు.

జలజీవన్ మిషన్ ద్వారా సురక్షితమైన నీరు

జలజీవన్ పథకం ద్వారా గ్రామాల్లో సురక్షితమైన తాగునీటిని ఏర్పాటు చేయడానికి జిల్లాలోని 38 మండలాల్లో 1445 పనులు (పైపులైన్లు, ఓవర్‌హెడ్ ట్యాంకులు) చేపట్టారు. ఇందులో 1028 పనులు పూర్తిచేయగా, 340 పనులు జరుగుతున్నాయి. 77 పనులు చేపట్టాల్సి ఉంది. ఇందుకుగానూ ఇప్పటి వరకు రూ.85 కోట్లు ఖర్చు చేశారు. ఈ పథకం ద్వారా గ్రామాల్లో సగటున ప్రతి వ్యక్తికి 55 లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు. జల జీవన్ పథకం ముఖ్య ఉద్దేశం 2024 సంవత్సరానికి గ్రామాల్లోని ప్రతి వ్యక్తికి 55 లీటర్ల సురక్షితమైన తాగునీటిని అందించడం. వీటి ద్వారా 3,21,000 వేల మందికి ఒక్కొక్కరికి సగటున 55 లీటర్ల ప్రకారం ప్రతి రోజూ 1,76,55,000 లీటర్ల నీటిని అందిస్తున్నారు.

నీటిలో రసాయనాలు ఎక్కువగా ఉంటే వచ్చే వ్యాధులివీ...

నైట్రేట్ : మిథనో హిమోగ్లోబియా 'నీలిబేబి' అనే వ్యాధి శిశువులకు సోకుతుంది.
సీసం : పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు ఆటంకం కలిగిస్తుంది. రక్తహీనతకు కారణమవుతుంది. మూత్రపిండాలను దెబ్బతీస్తుంది.
పురుగు మందులు : నాడీ వ్యవస్థ, పునరుత్పత్తి వ్యవస్థకు నష్టాన్ని కలిగిస్తాయి. రోగ నిరోధక శక్తిని తీవ్రంగా దెబ్బతీస్తాయి.
కాల్షియం : మలబద్ధకం, మూత్రపిండాల్లో రాళ్లకు కారణమవుతాయి.
ఫ్లోరైడ్ : ఎముకలు, దంతాలకు ఫ్లోరోసిస్
సోడియం : ఎక్కువ నష్టం కలిగిస్తుంది
మెగ్నీషియం కలిపిన సల్ఫేట్ : అతిసారం వస్తుంది
కేడియం : ఎముకలపై ప్రతికూల ప్రభావాన్ని కలిగిస్తుంది.
ఆర్సెనిక్ : చర్మవ్యాధులు, క్యాన్సర్‌కు కారణమవుతుంది
ఫ్లోరైడ్, ఫ్లోరోసిస్ : ఎముకల్లో వైకల్యాలు, కీళ్లలో సమస్యలు కలిగిస్తుంది.

1788 ఆవాస ప్రాంతాలకు సురక్షిత నీరు



జిల్లాలోని 1788 ఆవాస ప్రాంతాలకు సురక్షితమైన నీరు అందిస్తున్నాం. దర్శి, మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లోని 11 మండలాల్లో 65 ఆవాసాలకు 711 ట్రిప్పులతో 135 ట్యాంకర్లు తోలుతున్నాం. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మంచినీరు అందించేందుకు నీటి పరీక్షలకు ప్రాధాన్యత ఇస్తున్నాం. నీటి పరీక్షల్లో రసాయనాలు గుర్తించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడా తాగు నీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– షేక్ మారధాన్ ఆలీ, ఎస్ఈ, ఆర్‌డబ్ల్యూఎస్, ఒంగోలు

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర విజయవంతం చేయాలి



సమావేశం నిర్వహిస్తున్న అధికారి రామచంద్రుడు, కలెక్టర్ దినేష్‌కుమార్

● కేంద్ర ప్రభుత్వ జిల్లా ఇన్‌చార్జ్ అధికారి రామచంద్రుడు

ఒంగోలు అర్బన్: ఈ నెల 26వ తేదీ నుంచి వచ్చే ఏడాది జనవరి 26 వరకు జిల్లాలో చేపట్టే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కేంద్ర ప్రభుత్వంచే జిల్లా ఇన్‌చార్జ్ అధికారిగా నియమితులైన కేంద్ర సెన్సస్ ఆపరేషన్ డైరెక్టర్ ఎం రామచంద్రుడు జిల్లా అధికారులకు సూచించారు. కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్‌తో కలిసి కార్యక్రమంపై జిల్లా అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. మొదటిగా ఈ సంకల్ప యాత్రకు నోడల్ అధికారిగా ఉన్న జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ జిల్లా ఇన్‌చార్జ్ అధికారి మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 రకాల సంక్షేమ పథకాలను సంబంధిత ప్రభుత్వ శాఖల ద్వారా ప్రజలకు విస్తృతమైన అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులు సరిగా వినియోగించుకుంటున్నారో లేదో పరిశీలించాలన్నారు. పథకాలు పొందిన వారి విజయగాథలు వివరిస్తూ డాక్యుమెంటేషన్ చేయాలని సూచించారు. రెండు నెలలపాటు జరిగే కార్యక్రమానికి జిల్లాకు ఏడు వాహనాలను కేటాయిస్తారని, కేటాయించిన గ్రామాలన్నీ తిరిగి సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రచారం కోసం ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ ఈ యాత్ర కార్యక్రమాన్ని జిల్లాలో సజావుగా నిర్వహించేందుకు జిల్లా స్థాయిలో 40 మందితో, మండల స్థాయిలో ఐదుగురు, పట్టణ స్థాయిలో ఐదుగురు, గ్రామ స్థాయిలో 15 మందితో కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జెడ్పీ కార్యాలయంలో ఐదుగురు సభ్యులతో కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ రవికుమార్, డీఎస్ఓ ఉదయభాస్కర్, పశుసంవర్ధక శాఖ అధికారి బేబిరాణి, సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, బీసీ సంక్షేమ అధికారి అంజల, డీఎంహెచ్ఓ రాజ్యలక్ష్మి, వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, ఎల్‌డీఎం అబ్దుల్ రహీం, జెడ్పీ డీఈఓ సుబ్బారావు, సచివాలయ నోడల్ అధికారి ఉషారాణి, ఏఎస్పీ అశోక్‌బాబు పాల్గొన్నారు.

నిజమైన హీరోలు విభిన్న ప్రతిభావంతులు

● రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్



దివ్యాంగ విద్యార్థులకు ట్యాబ్స్ పంపిణీ చేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: విభిన్న ప్రతిభావంతులు నిజమైన హీరోలని, వారు అన్ని రంగాల్లో ముందుకు దూసుకెళ్తున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ ఆడిటోరియంలో శుక్రవారం ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి విభిన్న ప్రతిభావంతులకు కావలసిన ఉపకరణాలు అందించేందుకు వారిని గుర్తించే ఎసెస్‌మెంట్ క్యాంపులో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విభిన్న ప్రతిభావంతులకు అండగా నిలుస్తున్నారని, చిరువ్యాపారులు చేసే దివ్యాంగులను గుర్తించి మెప్మా ద్వారా రూ.10 వేల వరకు వడ్డీలేని రుణాలు అందజేస్తున్నారని, స్టెప్ పథకం ద్వారా రూ.2 లక్షల వరకు ఎటువంటి హామీ లేకుండా బ్యాంకుల నుంచి రుణాలు అందజేసేలా చర్యలు తీసుకున్నారని అన్నారు. గతంలో నిర్వహించిన క్యాంపునకు సంబంధించిన 73 ఉపకరణాలు రావాల్సి ఉందని, అందుకు రూ.12 లక్షలు చెల్లించాల్సి ఉందని, ఆ డబ్బును తానే చెల్లించి డిసెంబరు నెలాఖరులోపు ఉపకరణాలు పంపిణీ చేస్తానని హర్షధ్వనుల మధ్య ప్రకటించారు. ఈ శిబిరంలో అలంకో సంస్థ ప్రతినిధులు 60 మంది విభిన్న ప్రతిభావంతులను గుర్తించి వారికి ఉపకరణాలు అందజేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన ఏడుగురు విభిన్న ప్రతిభావంతులకు మంత్రి ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు టాబ్స్, దృష్టి లోపం ఉన్న ముగ్గురికి, వినికిడి లోపం ఉన్న మరో ముగ్గురికి ఉపకరణలు అందజేశారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభా వంతుల సంక్షేమశాఖాధికారిణి అర్చన, ఎంఈవోలు ఎం.ఆంజనేయులు, మల్లూనాయక్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాష పాల్గొన్నారు. .

అంబేడ్కర్ వర్ధంతి సభ కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బాలినేని

ఒంగోలు సెంట్రల్: దళిత సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సభ కరపత్రాలను శుక్రవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తన నివాసంలో ఆవిష్కరించారు. దళిత సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో అంబేడ్కర్ సంస్మరణ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని బాలినేని అన్నారు. విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం త్వరలోనే ప్రజలకు అంకితం చేయనున్నట్లు పేర్కొన్నారు. దళిత ఉద్యమ నాయకులు చప్పిడి వెంగళరావు, గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుబ్బారావు, దళిత సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు పత్రా బంగారం ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సంఘ బాధ్యులు తెలిపారు.





ఒంగోలు రంగారాయుడు చెరువు వద్ద పుట్టలో పాలుపోస్తున్న మహిళలు

నాగాయ.. అనంత రూపాయ

నాగుల చవితి పర్వదినాన్ని జిల్లాలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామ శివారుల్లోని పుట్టలు, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలు, శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పుట్టల్లో పాలుపోసి మొక్కులు చెల్లించుకున్నారు. - ఒంగోలు మెట్రో

జనగళం



జగనన్న కాలనీలో ఇల్లు వచ్చింది



మాకు ఇద్దరు పిల్లలు. భర్త కూలి పనులు చేస్తుంటారు. ఇప్పటి వరకూ మాకు సొంత ఇల్లు లేక పోవడంతో అద్దె ఇంటిలోనే నివాసముంటున్నాం. జగనన్న ప్రభుత్వంలో పట్టణ శివార్లలోని చెన్నరాయునిపల్లి లేఅవుట్‌లో మాకు ఇల్లు వచ్చింది. ఇల్లు కట్టుకోవడంతో పూర్తికావచ్చింది. ఇన్నాళ్లకు మా కల నెరవేరింది. త్వరలో సొంత ఇంటిలోకి వెళ్తాం.

– ఏ.లక్ష్మి, బాపూజీ కాలనీ, మార్కాపురం

గంటలోపే సర్టిఫికెట్లు అందజేశారు



జగనన్న సురక్ష క్యాంపుల్లో నాకు అవసరమైన సర్టిఫికెట్లు అన్నీ అందజేశారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది నా నుంచి వివరాలు తీసుకొని గంటలోపే కుల ధ్రువీకరణ, ఇన్‌కం సర్టిఫికెట్లతో పాటు పొలం అడంగల్, వన్‌బీ పత్రాలను అందజేశారు. గతంలో ఇలాంటి సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకొని రోజుల తరబడి పనులు వదిలేసి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఎలాంటి డబ్బులు వసూలు చేయకుండా గంటలోపే నాకు పత్రాలు అందజేశారు. గత పాలకులకు భిన్నంగా సీఎం జగన్ ఇలాంటి మంచి పనులు చేస్తున్నందుకు ఆనందంగా ఉంది.

– నక్కా లక్ష్మమ్మ, చౌటపాలెం, పొన్నలూరు మండలం

సొంత ఇల్లు నిర్మించుకున్నా

నాకు సొంత ఇల్లు లేకపోవడంతో గ్రామంలో అద్దెకు ఇల్లు తీసుకొని నివాసముంటున్నాను. వయస్సు పైబడటంతో కూలి పనులకు కూడా వెళ్లలేక, ఇంటి అద్దె కట్టలేక కొన్నేళ్లుగా నానా అవస్థలు పడ్డాను. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యాన నాకు స్థలం కేటాయించి ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయం చేశారు. దీంతో నేను కొత్తగా గృహాన్ని నిర్మించుకున్నా. ఆ ఇంటిని కలెక్టర్ దినేష్‌కుమార్ చేతుల మీదగా ప్రారంభించారు. సీఎం జగన్‌కి నా కుటుంబం రుణపడి ఉంటుంది.

– తన్నీరు రమణమ్మ, పొన్నలూరు



పొన్నలూరులో రమణమ్మ నిర్మించుకున్న కొత్త ఇంటిని ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

వైఎస్సార్ చేయూతతో జీవితానికి భరోసా ఇచ్చారు

నా భర్త టైలర్. భర్త సంపాదనతోనే కుటుంబం గడవాల్సిన పరిస్థితి. జగనన్న రెండు విడుతల్లో ఇచ్చిన వైఎస్సార్ చేయూతను సద్వినియోగం చేసుకున్నాను. ఇంట్లోనే చిల్లర కొట్టు పెట్టుకున్నాను. డ్వాక్రా రుణమాఫీ, జీరో వడ్డీ, జగనన్న తోడు పథకాలు వచ్చాయి. మాలాంటి మహిళలను ఆర్థికంగా ఆదుకుంటున్నారు. మా కుటుంబానికి జగనన్న అండగా నిలిచారు. నెలకు రూ.10 వేలకు తక్కువ కాకుండానే ఆదాయం వస్తుంది.

– షేక్ హస్మత్, చింతలపాలెం



క్లుప్తంగా

విశ్వకర్మ యోజన పథకాన్ని ఉపయోగించుకోండి

- సచివాలయాలు, సీఎస్సీ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోండి
- కుల వృత్తులను ప్రోత్సహించేందుకే రుణాలు
- ఏపీ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు ధనలక్ష్మి

ఒంగోలు సెంట్రల్: ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంలో అర్హులైన చేతివృత్తుల వారు కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్సీ)లో గానీ, గ్రామ, వార్డు సచివాలయాల్లోగానీ దరఖాస్తు చేసుకోవాలని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు కె.ధనలక్ష్మి తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వారసత్వ పరంపరను ప్రోత్సహించి సంప్రదాయ పనిముట్లు, చేతులను ఉపయోగించి పనిచేసే కళాకారుల కుటుంబ ఆధారిత వృత్తులను బలోపేతం చేయడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని చెప్పారు.

వడ్రంగి, స్వర్ణకారులు, శిల్పాలు, విగ్రహాలు, బుట్టలు, చాపలు, మట్టి పాత్రలు, చీపుర్లు తయారు చేసే వారు, దోబీ, టైలర్, చేప వలలు తయారు చేసే వారు, చెప్పులు కుట్టే వారు, తాపీ కార్మికులు, క్షురకులు, సంప్రదాయ బొమ్మలు, పూల దండలు, పడవల తయారీదారులు, ఇంటి తాళాలు తయారు చేసే వారు అర్హులని వివరించారు. ఆధార్, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాస్ పుస్తకం, మొబైల్ నంబర్‌తో పాటు మొబైల్ తీసుకుని సచివాలయాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ముందుగా రూ.లక్ష రుణాన్ని 5 శాతం వడ్డీతో ఇస్తారని, వాటిని 18 నెలల్లో తిరిగి చెల్లించాలని తెలిపారు. రెండో విడతగా రూ.2 లక్షల రుణం ఇస్తారని, వాటిని 30 నెలల్లో తిరిగి చెల్లించాలని తెలిపారు. దరఖాస్తుదారులు 18 సంవత్సరాలు నిండి ఉండాలని గతంలో ఎటువంటి రుణం తీసుకుని ఉండకూడదని చెప్పారు. ఎంపిక మూడు దశల్లో ఉంటుందని, ఎంపికైన దరఖాస్తుదారునికి శిక్షణ ఉంటుందని, శిక్షణలో పాటు ఉపకార వేతనంగా రూ.500 చెల్లిస్తారని వెల్లడించారు.

కులవృత్తుల వారికి పనిముట్లు కొనుగోలు చేసేందుకు రూ.15 వేలు ఇస్తారని చెప్పారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో అర్హత ఉన్న మైనార్టీస్ (ముస్లిం, దూదేకుల, క్రిస్టియన్ మైనారిటీస్) ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9849901157, 9951160149, 08402-230169 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

గ్రామ, వార్డు స్థాయి నుంచి ఆడుదాం ఆంధ్రా

- 15 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసున్న వారంతా పాల్గొనేందుకు అర్హులు
- సచివాలయం మొదలు రాష్ట్ర స్థాయి వరకు 5 దశల్లో పోటీలు
- విజేతలకు జనవరి 26న బహుమతుల ప్రదానోత్సవం
- కమాండ్ కంట్రోల్ ఆధ్వర్యంలో ఆర్గనైజింగ్ కమిటీతో పర్యవేక్షణ
- ప్రజలు, ప్రజాప్రతినిధులంతా భాగస్వాములు కావాలనేదే ప్రభుత్వ ఆకాంక్ష
- నాణ్యతతో కూడిన నాన్ ప్రొఫెషనల్, ప్రొఫెషనల్ కిట్లు సిద్ధం
- వివరాలు వెల్లడించిన కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్


స్టెప్ సీఈఓతో కలిసి క్రీడా పరికరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు: గ్రామ, వార్డు స్థాయి నుంచి ప్రతి ఒక్కరినీ క్రీడల్లో భాగస్వాములను చేసేందుకు ఆడుదాం ఆంధ్రా అనే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మినీ స్టేడియంలో ఆడుదాం ఆంధ్రా పోటీలకు ప్రభుత్వం అందించిన క్రీడా పరికరాలను కలెక్టర్ పరిశీలించారు. ప్రొఫెషనల్ కిట్లు, నాన్ ప్రొఫెషనల్ కిట్ల మధ్య వ్యత్యాసాన్ని తెలుసుకున్నారు. మెటీరియల్ పంపిణీ ఎలా చేపడుతున్నారంటూ స్టెప్ సీఈవో ఎంపీ లోకేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నారదమునిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ.. ఆడుదాం ఆంధ్రా ప్రతిష్టాత్మక క్రీడా పోటీల్లో 15 ఏళ్లు, ఆపై వయసున్న ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయాలనేదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. దీనికి సంబంధించి ఈనెల 20న రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఈలోగా ప్రతి వలంటీర్ తమ పరిధిలో ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. జిల్లాలో 540 గ్రామ సచివాలయాలు, 200 వార్డు సచివాలయాల్లో పోటీల నిర్వహణకు వ్యాయామ ఉపాధ్యాయులను మ్యాపింగ్ చేశామన్నారు. ఆటస్థలం అభివృద్ధి, పోటీల నిర్వహణ సమయంలో స్కోరింగ్ తదితర కార్యక్రమాలకు ప్రతి సచివాలయం పరిధిలో 10 మంది యువతను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. ప్రధానంగా వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ, క్రికెట్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని, ఇవి కాకుండా ప్రజలను క్రీడలపై ఆసక్తి కలిగించేందుకు టెన్నికాయిట్(రింగ్ ఆట) లాంటివి కూడా నిర్వహించుకోవచ్చన్నారు.

ఐదు దశల్లో పోటీలు

గ్రామ, వార్డు పరిధిలో విజేతలైనవారు మండల స్థాయికి, మండల స్థాయిలో ఎంపికైన వారు నియోజకవర్గ స్థాయికి, అక్కడి విజేతలు జిల్లా స్థాయికి, అక్కడ నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్తారన్నారు. పోటీలు డిసెంబర్ 15 నుంచి 2024 జనవరి 25వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. జనవరి 26న విశాఖలో రాష్ట్ర స్థాయి విజేతలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నగదు బహుమతులు, ట్రోఫీలు, మెడల్స్, ప్రశంసాపత్రాలు అందిస్తారని పేర్కొన్నారు. అదే రోజు జిల్లా, మండల స్థాయిలో విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. పోటీల పర్యవేక్షణకు జెడ్పీ సీఈవో, ఎస్ఈ పంచాయతీరాజ్, జిల్లా పంచాయతీ అధికారులతో కూడిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను జిల్లా స్థాయిలో ఏర్పాటు చేశామని, మండల స్థాయిలో సగం గ్రామాలు తహసీల్దార్‌కు, మిగిలిన సగం గ్రామాలు ఎంపీడీఓలకు బాధ్యతలు అప్పగించామన్నారు. మాజీ క్రీడాకారులు కూడా పోటీల్లో పాల్గొని తమ అనుభవాలతో నేటి యువతకు స్ఫూర్తినిచ్చేందుకు ఇదొక అద్భుత అవకాశమన్నారు. ప్రజలతోపాటు ప్రజా ప్రతినిధులు, క్రీడాభిమానులు, క్రీడాకారులు, క్రీడా సంఘాల ప్రతినిధులను భాగస్వాములను చేసి క్రీడా స్ఫూర్తిని చాటి చెప్పేలా పోటీలు నిర్వహిస్తామని కలెక్టర్ దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. స్టెప్ చీఫ్ కోచ్ గుంటి రాజరాజేశ్వరి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కె.వనజ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా విద్యుత్ ఉద్యోగుల సత్తా

- బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయి పోటీల్లో మొదటి స్థానం
- అభినందించిన ఏపీసీపీడీసీఎల్ జిల్లా ఎస్ఈ సత్యనారాయణ


విద్యుత్ శాఖ డైరెక్టర్ చేతుల మీదుగా ట్రోఫీ అందుకుంటున్న జిల్లా విద్యుత్ ఉద్యోగులు

ఒంగోలు సబర్బన్: రాష్ట్ర స్థాయి విద్యుత్ ఉద్యోగుల క్రీడల్లో జిల్లా బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు సత్తా చాటారు. నెల్లూరులో నిర్వహించిన ఈ పోటీల్లో మొదటి స్థానం సాధించి విద్యుత్ శాఖ డైరెక్టర్ చేతుల మీదుగా ట్రోఫీ అందుకున్నారు. ఈ సందర్భంగా ఏపీసీపీడీసీఎల్ జిల్లా ఎస్ఈ కేవీజీ సత్యనారాయణ ఉద్యోగ క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. శుక్రవారం స్థానిక విద్యుత్ భవన్‌లో వారిని సన్మానించారు. ఉద్యోగులు పని ఒత్తిడిలోనూ క్రీడల్లో ప్రతిభ కనబరిచారని కొనియాడారు. రాష్ట్ర స్థాయిలో జిల్లాకు మంచి పేరు తీసుకొచ్చారని క్రీడాకారులు పున్నారెడ్డి, సుభాని, ఆంజనేయులు, చెన్నకేశవులు, వీరాంజనేయులు, శ్రీనివాసులు, రామిరెడ్డి, శ్రీనివాసరావును ఎస్ఈ సత్యనారాయణ ప్రత్యేకంగా అభినందించారు.

ఉమ్మడి ప్రకాశం బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక రేపు

ఒంగోలు: ఉమ్మడి ప్రకాశం జిల్లా స్త్రీ, పురుషుల బాల్ బ్యాడ్మింటన్ జట్లను ఈ నెల 19వ తేదీ మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంపిక చేయనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.వెంకటస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ఎంపిక ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఎటువంటి వయోపరిమితి లేదని, ఆసక్తి గల క్రీడాకారులు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్‌కార్డు తీసుకునిరావాలని సూచించారు. ఎంపికైన జట్లు వచ్చే నెల 8 నుంచి 10వ తేదీ వరకు గొల్లపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 9849429859, 9010613146 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

అటవీ ఫలసాయం సేకరణపై చెంచులకు శిక్షణ


చెంచులకు అవగాహన కల్పిస్తున్న ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి

పెద్దదోర్నాల: ట్రైబల్ ఫ్రైడే, జన్ జాతీయ గౌరవ్ దివస్‌ను పురస్కరించుకుని శుక్రవారం మండల కేంద్రంలోని శివసదనంలో నిర్వహిస్తున్న సీఎంవీడీవీకే లబ్ధిదారుల రెండు రోజుల శిక్షణ తరుగతులను శుక్రవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రవీంద్రారెడ్డి చెంచులను ఉద్దేశించి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెంచుల అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడుతున్నాయన్నారు. ఈ సందర్భంగా కలపేతర అటవీ ఫలసాయాల సేకరణలో మెళకువలు, ప్యాకింగ్, మార్కెటింగ్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీడీ కేజీ నాయక్ తిరుపతి, జవహర్‌లాల్ బాషా, లాలాఅహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి

కబడ్డీ పోటీల శిక్షణ


రగ్బీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు


కబడ్డీ శిక్షణలో క్రీడాకారులు

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అండర్ 14 ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి కబడ్డీ శిక్షణ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. పాఠశాల హెచ్ఎం విజయలక్ష్మి, పీడీ ఎం.బాలగురవయ్యల పర్యవేక్షణలో నిర్వహించిన ముగింపు కబడ్డీ పోటీలను పాఠశాల కమిటీ సభ్యులు మాజీ సర్పంచ్‌లు పాదిలి వెంకటేశ్వర్లు, పాదిలి తిరుపతయ్య, ఎస్.వెంకటేశ్వర్లు క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కబడ్డీ శిక్షణలో నేర్చుకున్న మెళకువలు పాటించి రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలన్నారు. పాఠశాల పీడీ ఎం.బాలగురవయ్య మాట్లాడుతూ వారం రోజుల పాటు దాతల సహకారంతో జెడ్పీ పాఠశాల ఆవరణలో కబడ్డీ శిక్షణ శిబిరం ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని గొట్లగట్టు, కనపర్తి, కొత్తపట్నం, వాడరేవు, చెన్నారెడ్డిపల్లి, పాకల, వేటపాలెం, భూపతిపల్లి జెడ్పీ పాఠశాలల నుంచి ఎంపికైన 12 మంది కబడ్డీ క్రీడాకారులు ఈ నెల 18, 19, 20 తేదీల్లో అన్నమయ్య జిల్లా చిట్వేలులో నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లా తరఫున పాల్గొంటారని అన్నారు. అలాగే నాలుగు రోజుల పాటు నిర్వహించిన అండర్ 14, 17 రగ్బీ పోటీలకు సంబంధించి నిర్వహించిన జిల్లా స్థాయి శిక్షణ పోటీల కార్యక్రమంలో పాల్గొన్న రగ్బీ క్రీడాకారులు ఈ నెల 18, 19, 20 తేదీల్లో కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటారని పీడీ బాలగురవయ్య అన్నారు.

కబడ్డీ క్రీడాకారులకు యూనిఫాం, దుస్తులు పంపిణీ:

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు గొట్లగట్టు గ్రామానికి చెందిన పరిటాల నారాయణరావు, మామిడిశెట్టి శ్రీనుల జ్ఞాపకార్థం సుబ్బయ్య, చరణ్‌లు రూ.15 వేలు విలువైన క్రీడా దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కబడ్డీలో ప్రతిభ చూపి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పీఈటీ అచ్చయ్య, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం జగన్ ఆలోచనే

వైఎస్సార్ సీపీ సిద్ధాంతం



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, వేదికపై మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, నాయకులు

- సమష్టిగా వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలు నిర్వహించుకుందాం
- ఊపిరి ఉన్నంత వరకు వైఎస్సార్ సీపీకి సేవ చేయడమే లక్ష్యం
- దేశ చరిత్రలోనే అట్టడుగు వర్గాలకు అత్యధికంగా సంక్షేమ ఫలాలు అందించిన ఏకైక సీఎం వైఎస్ జగన్
- సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

ఒంగోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనే వైఎస్సార్ సీపీ సిద్ధాంతమని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. శుక్రవారం స్థానిక విష్ణుప్రియ ఫంక్షన్ హాలులో నిర్వహించిన వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గస్థాయి నాయకులు, కార్యకర్తల వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్క అభ్యర్థి గెలవాలనేదే సీఎం జగన్ ఉద్దేశమని అన్నారు. అందులో భాగంగా పార్టీ గెలుపు కోసం ఎన్నికలకు ముందు నిర్వహిస్తున్న వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలను ప్రతి ఒక్కరం విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన ఫ్లెక్సీల ఆవిష్కరణతో పాటు ప్రైవేటు ప్లేసుల్లో పార్టీ పతాకాలను ఎగురవేయాలని సూచించారు. రాత్రి ఆ సచివాలయ పరిధిలో బస చేయడం, మరునాడు ఆ సచివాలయ పరిధిలోని ప్రజలను కలుసుకుని వారి నుంచి రిపోర్టు స్వీకరించడాన్ని ప్రణాళికాబద్ధంగా నిర్వహిద్దామన్నారు. అవకాశాలు అందరికీ దక్కాలని, అయితే అందుకోసం అబద్ధపు ప్రచారం మాత్రం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. తాను ఎమ్మెల్యేగా గెలిచానంటే అది తన కుటుంబ వారసత్వం కాదని, కేవలం వైఎస్ జగన్, బాలినేని, బూచేపల్లి కుటుంబాలతో పాటు సంతనూతలపాడు వైఎస్సార్ సీపీ శ్రేణులే కారణమని అన్నారు. జగన్ ఎవరిని నాయకుడిగా ప్రకటిస్తే వారినే వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు సైన్యం గెలిపించుకుంటుందన్నారు. అంత విశ్వాసం గల సైన్యం సంతనూతలపాడు సైన్యమని అన్నారు. ఓటర్ల జాబితాలను పారదర్శకంగా పరిశీలించాలని, అదే విధంగా బూత్ కమిటీలకు కూడా అవసరమైన చోట మార్పులతో త్వరగా నూతన కమిటీల జాబితాలను అందించాలని అన్నారు. జగన్ రాష్ట్రానికి మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే అట్టడుగు వర్గాలు ఆనందంగా ఉండగలుగుతాయన్నారు. దేశ చరిత్రలోనే అట్టడుగు వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. అటువంటి నాయకుడిని రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా మరోమారు ఎన్నుకునే కార్యక్రమంలో రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరం మమేకమవుదామని ఎమ్మెల్యే టీజేఆర్ పిలుపునిచ్చారు.

దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ ఏ నియోజకవర్గం టికెటైనా కేవలం సర్వేల ప్రకారమే సీఎం కేటాయిస్తారన్నారు. చంద్రబాబు పని అయిపోయిందని, ఆయనను నమ్మే పరిస్థితి లేకుండా పోయిందని అన్నారు. ఇక లోకేష్ అయితే బీరాలు పలికేందుకే పరిమితమని ఎద్దేవా చేశారు. ఇటువంటి పరిస్థితిలో టీడీపీని ప్రజలు విశ్వసించరన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందుతున్న వారిలో కరుడు గట్టిన టీడీపీ వీరాభిమానులు కూడా ఉన్నారని, వారు తప్ప 65 శాతం మంది వైఎస్సార్ సీపీకే ఓటు వేస్తామని అంటున్నారని వెల్లడించారు. పార్టీ సర్వేతో పాటు తాను సైతం ఒక సర్వే చేయించానని, అందులో కూడా 2024లో వైఎస్సార్ సీపీనే విజయభేరి మోగిస్తుందని స్పష్టమైందని తెలిపారు. చంద్రబాబు జైలులో ఉన్నప్పుడు ఆ యాత్రలు, ఈ యాత్రలు అంటూ హడావిడి చేసిన వారు నేడు వాటి ఉనికే మరిచారన్నారు. అందరం సమిష్టిగా వైఎస్సార్ సీపీని గెలిపించుకుని సీఎంకు విజయాన్ని అంకితం చేద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో సంతనూతలపాడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం విజయవంతం చేసే అంశంపై, పార్టీ బలోపేతంపై తమదైన శైలిలో మాట్లాడారు. పార్టీ సంతనూతలపాడు మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మద్దిపాడు ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, పార్టీ ఉపాధ్యక్షుడు ఇనగంటి పిచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గట్టినేని అయ్యన్న, కార్యదర్శి ఎస్‌కే బాబు, నాగులుప్పలపాడు మండల అధ్యక్షుడు పోలవరపు శ్రీమన్నారాయణ, పమిడి వెంకటేశ్వర్లు, క్రిష్టిపాటి శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీలు దుంపా రమణమ్మ, వేమా శ్రీనివాసరావు, ఎంపీపీలు బి.విజయ, వాకా అరుణ కోటిరెడ్డి, వైస్ ఎంపీపీలు జేష్ఠ శ్రీనివాసరావు, మోరబోయిన విజయలక్ష్మి, సంజీవరావు, పైడి వెంకట్రావు, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్ కొలకలూరి విజయ్‌కుమార్, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు నర్రా సురేష్‌బాబు, చీమకుర్తి మున్సిపల్ చైర్మన్ గోపురపు రాజ్యలక్ష్మి, జేసీఎస్ కన్వీనర్లు కుమ్మారి సుధాకర్, దుంపా యలమందారెడ్డి, మస్తాన్‌రెడ్డి, మంచాల హరికృష్ణ, నవీన్, బత్తుల శ్రీనివాసరావు, ఎంపీటీసీలు, సర్పంచులు, సచివాలయ కన్వీనర్లు, అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

మెడికల్‌ది కాదు.. మేనేజ్ రిపోర్ట్

- చంద్రబాబు మెడికల్ రిపోర్ట్‌లో పొంతన లేని వివరాలు
- కాల్షియం స్థాయి 1611 ఉంటే కంటి వైద్యం ఎలా చేశారు
- వ్యవస్థలను మేనేజ్ చేయడంలో చంద్రబాబు దిట్ట
- మెడికల్ బోర్డు ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేయించాలి
- వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ బత్తుల, డాక్టర్ యాదాల


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ వైద్యవిభాగం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ బత్తుల, డాక్టర్ యాదాల

ఒంగోలు: చంద్రబాబు వ్యవస్థలను మేనేజ్ చేయడంలో దిట్ట అని ఆయన కోర్టుకు సమర్పించిన మెడికల్ రిపోర్టుతో మరోమారు స్పష్టమైందని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ యాదాల అశోక్‌బాబులు విమర్శించారు. చంద్రబాబు మెడికల్ రిపోర్ట్ పూర్తి అసంబద్ధంగా ఉందని, అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కంటి ఆపరేషన్ కోసం బెయిల్ పొందిన చంద్రబాబు తిరిగి ఈనెల 28న జైలుకు వెళ్లాల్సి ఉందని, ఈ నేపథ్యంలో ఆయన తరఫు లాయర్లు కోర్టులో సమర్పించిన మెడికల్ రిపోర్టులో వివరాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగంలో చంద్రబాబు అడ్మిట్ అయితే కార్డియాక్‌కు సంబంధించిన మెడికల్ రిపోర్టు ఎలా వచ్చిందని ప్రశ్నించారు. ఛాతీలో నొప్పిగా ఉందని ఆస్పత్రిలో చేరిన చంద్రబాబు పూర్తి స్థాయిలో పరీక్షలు చేయకముందే డిశ్చార్జి కావడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఏఐజీ ఆస్పత్రిలో ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ సోమరాజు ఉండగా, గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ రిపోర్టు ఇవ్వడం, దానినే పరిగణనలోనికి తీసుకోవాలని చంద్రబాబు తరఫు లాయర్లు కోర్టును కోరడంపై విస్మయం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మెడికల్ బోర్డు ఏర్పాటు చేసి చంద్రబాబుకు పూర్తి స్థాయిలో వైద్య పరీక్షలు నిర్వహించి కోర్టుకు సమర్పించాలని ప్రభుత్వాన్ని, సీఐడీ విభాగాన్ని కోరారు.

వైద్య విభాగం రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ చిడితోటి జీవన్ మాట్లాడుతూ.. చిన్నపిల్లలు బడికి ఎగ్గొట్టేందుకు "అమ్మా కడుపు నొప్పి" అని చెబుతుంటారని, చంద్రబాబు మెడికల్ రిపోర్ట్ చూస్తే ఆయన కూడా అదే తీరులో వ్యవహరిస్తున్నట్టుగా ఉందని ఎద్దేవా చేశారు. కాల్షియం స్కోర్ 400 దాటితేనే వైద్యులు పలు జాగ్రత్తలు సూచిస్తారని, అలాంటిది 1611కు ఉందంటే కంటి ఆపరేషన్ చేసేందుకు వైద్యులు అంగీకరించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. హృద్రోగ నిపుణుడి సలహా తీసుకోకుండానే చంద్రబాబు కంటి వైద్యం పూర్తి కావడం అయోమయంగా ఉందన్నారు. ఈ సందిగ్ధతకు చెక్ పెట్టాలంటే మెడికల్ బోర్డుకు రిఫర్ చేయడమే ఉత్తమమన్నారు.

పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసు వెంకయ్య మాట్లాడుతూ.. చంద్రబాబు కోర్టుకు సమర్పించింది మెడికల్ రిపోర్టు ఏమాత్రం కాదని, మేనేజ్ చేసి తీసుకున్న రిపోర్ట్ అని పేర్కొన్నారు. చంద్రబాబు వ్యవస్థలను మేనేజ్ చేసినట్లుగా ఈ ప్రపంచంలో ఇంకెవరూ చేయలేరన్నారు. ఆయనకు మెడికల్ బోర్డు ద్వారా మరోమారు వైద్య పరీక్షలు నిర్వహించడం మంచిదని అభిప్రాయపడ్డారు. సమావేశంలో నగర అధ్యక్షుడు డాక్టర్ జాలాది మణిబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి కృషి

- పోలీస్ గ్రీవెన్స్‌లో ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు సబర్బన్: పోలీస్ సిబ్బంది వృత్తి పరమైన సమస్యలు ఏమైనా ఉంటే స్వయంగా తన దృష్టికి తీసుకురావాలని ఎస్పీ మలికాగర్గ్ పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ఎల్లవేళలా కృషి చేస్తామన్నారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లు, వివిధ విభాగాల్లో పనిచేస్తున్న పోలీస్ సిబ్బంది నేరుగా ఎస్పీని కలిసి తమ సమస్యలు విన్నవించుకున్నారు. వ్యక్తిగత సమస్యలతో పాటు బదిలీలు, హెచ్ఆర్ఏ తదితర సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. సిబ్బందితో ముఖాముఖి మాట్లాడిన ఎస్పీ.. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. అర్జీలను సంబంధిత విభాగాల అధికారులకు పంపి పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, డీపీఓ ఏఓ ఎం.సులోచన, ఆర్ఐ శ్రీహరి రెడ్డి, స్పందన ఎస్సై శ్రీనివాసరావుతో పాటు డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.



పోలీస్ సిబ్బంది సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ మలికా గర్గ్